కథా నిలయం
శ్రీకాకుళం



# ఇంటివాడు

అన్నింటి కంటె ఆలోచనల ముట్టడి ఘోరమైనది. అందులో బందీ అయితే తప్పించుకునే వాడుండడు. ఆ ముట్టడి ఒక్కో సమయం ముప్పు తెస్తే ఒక్కో నిమిషం ముదాన్ని కలిగిస్తుంది.

సరిగ్గా ఈలాగునే యిరుక్కుపోయాడు శివబ్రహ్మాం. అలా అతను యిరుక్కుపోడానికి కారణం యిరికించిన వాడే! వాడి పేరు శరభలింగం.

'ఈ ఆలోచన బుర్రలో పుట్టుండకపోతే బాగుణ్ణు. కుమ్మరి పురుగు మల్లే తొలుస్తున్నదాయె' విసుగ్గా అనుకుని ఒకసారి పక్కమీద అటు - యిటు దొర్లాడు.

కునుకు కూడా అతనికి శత్రువైంది. అవదూ! ఇటువంటి కాంక్షాపరులకే అది బద్ధ విరోధి. కోరికలుండని మనుజుండడేమో! కాని అత్యాశ పెట్టుకుని మనసుని రకరకాలుగా చిత్రవధకు గురిచేసే శివబ్రహ్మాంలాంటి వారికి యిలాంటి శిక్ష సహజం.

'స్టీల్‌ప్లాంట్ ఏరియాలో ఫ్లాట్స్ - పసిడి కేదారాల్లా కళ్ళముందర తళతళలాడుతున్నె. అవి తమ పరం చేసుకుంటే కనకవర్షమే! అని చెప్పి ఆశకు చోటిచ్చినవాడు మమ్మూర్తులా శరభలింగమే!

సూదిమొన మోపటానికి చోటిస్తే చాలు సీటంతా ఆక్రమించటానికి ప్రయత్నించే

ప్రవృత్తిగల శివ బ్రహ్మానికి సరియైన జోడీ అయినాడు శరభలింగం.

సంఘంలో పెద్ద మనిషి శరభలింగం. అటుదిటు – యిటుదటు చేయగల సమర్థుడు. ఎవర్ని ఎలా కరిగించి లొంగదీసుకోవాలో ఎరిగిన ఘనుడు. తనపేర కన్సల్టెన్సీ సంస్థ నిర్వహిస్తున్నాడు. భూమి కొనుగోలు, అమ్మకం, ఇల్లు కట్టించటాలు అతని వ్యాపకాలు. ఇద్దరు ముగ్గురు అసిస్టెంట్స్ చేతిలో వున్నారు. ఎపుడూ యమ బిజీ! ఎవర్నీ ఒదులుకోడు. ఏ బేరాన్నయినా 'సారం' చేయనిదే వదలడు.

వయస్సు నలభైపైనే అయినా టేకుమానులా ఖణీగా కనిపించే శరభలింగం ఎప్పుడూ పారపళ్ళతో నవ్వులు చిందిస్తూ ఎదుటివాళ్ళ (మనసు)ను దోచేస్తుంటాడు.

ఆనందఝరిలో పడవేసే ఆ నవ్వుకే పడిపోయాడు శివబ్రహ్మం. ఎక్కడో పేపర్లో చూశాడు ప్రకటన. ఇల్లు కట్టాలన్న ధ్యాస వుండబట్టి ఆ చిరునామాకు బయలుదేరాడు.

మందీమార్బలంతో నలుగుర్ని పోగేసుకున్న శరభలింగాన్ని చూస్తూనే 'ఓహో' అంటూ నోరు బార్లా తెరిచేశాడు. అతని మాటలు తేనెవూటలూరించాయి. కలిసిన వెంటనే కరచాలనం చేశాడు. కమ్మని కాఫీ తెప్పించాడు. తర్వాత మాటామంతీ మొదలెట్టాడు.

ఆమాట, ఈమాట బంతుల్లా దొర్లాక చిన్నప్పటి ఫ్రెండ్స్ అయిపోయారు. అదీ శరభలింగం ఏదో జ్ఞాపకం చేశాక–

'ఓర్నువ్వా! అంటే ఓర్నువ్వా' అనుకున్నారు. 'ఏంపనిమీదొచ్చినావ్?" ప్రత్యేకంగా ప్రశ్నించాడు.

"ఏంపనిమీదొస్తారు నీదగ్గరికి?" తిరిగి ప్రశ్నగానే అడిగాడు శివబ్రహ్మం.

"ఓర్నీ ప్రశ్నకు ప్రశ్నే ఏసినావ్! నా మాటది కాదు. అమ్మకాలు, కొనుగోళ్ళూ రెండూ వుంటాయి కదాని! ఫ్లాట్ కొంటావా! అమ్ముతావా!"

"ఎక్కడ బాగుంటుందో నాకోటి సెటప్ చెయ్యి. రేపు అయిదేళ్ళ తర్వాతమ్ముతే రెండింతలై సొమ్ము గలగల్లాడాల' –భ్రాంతి బయటపెట్టాడు.

శరభలింగం – అసిస్టెంట్స్‌ను పిలిచాడు. వాళ్ళేవో పుస్తకాలు పట్టుకొచ్చారు. చిత్రగుప్తుడి చిట్టాపద్దుల్లా వున్నాయవి. ఏ మనిషి చేసిన తప్పుకు ఏ శిక్షో రాసినట్లుగా – ఏ ప్రాంతంలో ఏ రేటుందో... రాసి పెట్టుకున్నాడు. ఎక్కడ లాభసాటిగా వుంటే అక్కడ దుకాణం తెరవాలన్న పట్టుదల శివబ్రహ్మానిదయితే అటువంటి గట్టిపిండాన్ని ఓ పట్టుపట్టాలన్న బుద్ధి శరభలింగానిది.

"లింగం!!" పిలిచాడు శివబ్రహ్మం.

"అబ్బా! అట్టా పిలవమాకయ్యా! అదేదో బూతుపదంలా అనిపిస్తుంది. జనం అపార్థం చేస్కుంటారు" మొహం చికాగ్గా పెట్టాడు శరభలింగం.

"చిన్నప్పుడు స్కూల్లో కూడా అట్లాగే పిలిచేవాడ్నయ్యా!"

"ఉద్ధరించావు గాని, అసలు విషయం చెప్పు..."

"ఏంలేదు! స్టీల్ ప్లాంట్ దగ్గరయితే రేటు మంచిగుందట. అక్కడ ఓ యిల్లు లేపాలనుంది. నువ్వు సాయం చేస్తే నే కట్టుకుంటా!"

"శుభం... చాలా కాస్ట్లీ! దిగినాక గేదెల బేరం కాకూడదు. చూస్కో".

"ఫర్వాలేదు. మంచి ప్లేసు చూసిపెట్టు... ఏ పొజిషన్లో కట్టుకుంటే పైసలు రాల్తాయో చూడు".

శరభలింగం బుర్ర పదును పెట్టాడు. మిత్రుడి సంబంధమంటూ పెంచుకున్నాక తప్పదు. లాభసాటిగానే చూడాలి. పుస్తకాలు తిరగవేశాడు. చాలామందికి ఆఫర్లైపోయినాయి. కాని ఒక జాగా మాత్రం ఇంకా ఓ నిర్ణయానికి రాకుండా వుండిపోయింది. అవతల పార్టీచేత నయానో, భయానో ఒప్పించి ఖాయపరచవచ్చు.

ఓ కొలిక్కి వచ్చాక హామీ ఇచ్చాడు. "మొదట ఓ యాభైవేలుంటే ప్లాట్ కొనుగోలు రిజిస్ట్రేషన్‌తో సహా నీపరమౌతుంది. తర్వాత ఇల్లు ప్లాన్ చేద్దాం" తృప్తి పడ్డాడో లేదోనని చూశాడు శరభలింగం.

ఏదో అసంతృప్తి చీకటిలా కదలాడుతోంది. ఏమాలోచించాడో ఏమో – 'సర్లే! నాల్గురోజుల్లో వచ్చి నీ దగ్గర వాల్తా... నాకు ఖాయపరుద్దుగాని." శివబ్రహ్మం కదిలాడు.

అలా ఇల్లు చేరిందే తడవుగా ఒక్కో ఆలోచన, ఒక్కో కందిరీగయింది. దానిక్కారణం యింట్లో వారి మాటలు.

"సాహసం చేస్తున్నారేమో కొంచెం ఆలోచించండి. మనకంటూ ఓ పాత పెంకుటిల్లు పల్లెటూరిలో పడుందాయే. మళ్ళా ఈ ఇంటి గొడవలు మనకెందుకు" అంది భార్య అర్పణ.

శివబ్రహ్మానికి పూర్వీకుల నుంచి వస్తున్న యిల్లొటి పల్లాపురంలో వుంది. దానికో దీపం పెట్టే దిక్కయినాలేక పడుంటే ఓ మేస్టారికి ఈ మధ్యే అద్దెకిచ్చారు. పట్నం అవసరాలు పల్లెని వెక్కిరిస్తున్న ఈ రోజుల్లో దాన్ని శిధిలావస్థలో వదిలేయటం కంటె ఎవరికయినా అమ్మివేస్తే బాగుండునని పించింది.

"ఇల్లమ్ముతారా! పూర్వంనుండి వస్తున్న యింటిని అమ్మటం శ్రేయస్కరం కాదు నాన్నా! సరదాగా అప్పుడప్పుడు సెలవుల్లో వెళ్ళి గడపటానికి ప్రశాంతంగా వుంటుంది". తండ్రివైనం ఎంతమాత్రం భావ్యంగా అనిపించలేదు కొడుకు శిరీష్‌కు. ఉన్నది ముచ్చకాయ ముగ్గురు. అందులో వ్యతిరేకించినదిద్దరే! మిగిలింది కూతురు విద్య. మనస్తత్వం ఎదిగితే ఆ పిల్ల అదే పని చేసేదేమో!

మహా అయితే ఇల్లు అమ్మితే ఓ పదివేలు వస్తాయి. మిగిలింది ఓ తోట. దాన్ని కూడా ఎవరికయినా బేరం పెడితే ఓ నలభైవేలన్నా రాకపోవు. ఏభైవేల ముద్దంకె చేసి శరభలింగానికి అప్పచెబితే చాలు పంటపండినట్లే!

"తోటకూడా అమ్మివేస్తారా! ఘోరం! ఎపుడో బంగారం కాబోతుందని ఎవరూలేని ఎడారిలాంటి ఆప్రదేశంలో ఎవరో పురిగొల్పారని ప్లాట్ కొంటారా!"

"ఏడాది కెంతో కొంత ఆదాయం తోటపై వస్తూంది. అటువంటపుడు అమ్మటం మంచిది కాదంటావు! అంతేనా! పెద్దవాడ్ని నాకు తెలీని లాభసాటి వ్యాపారం నీకు ఏం తెల్సని?" కొట్టిపారేశాడు.

కొడుకు మాటనే లెక్కచేయని అతని మొండివైఖరి ఇదివరకే ఎరిగిన భార్య అర్పణ నోరు నొక్కేసుకుంది.

తనను కాదన్నవాళ్ళని ఖాతరు చేయడు శివబ్రహ్మం. తన పంథా తనది. తనరీతి తనది. అనుకున్న పని యిట్టే అయిపోవటానికి ఎన్ని ఉపాయాలున్నాయో అన్నీ పన్నుతాడు. చివరికి నెగ్గటం ఖాయమని నమ్ముతాడు. అలాగే విజయం కూడా వరిస్తుంది.

మర్నాడు ఓ సారి 'శరభ కన్సల్టెంట్స్'కు ఫోన్ కొట్టాడు. యాభైవేలు పట్టుకువస్తానని, ప్లాట్ ఎవరికీ అమ్మవద్దని చెప్పాడు. త్వరగా నగదుపట్టుకు రాకపోతే ఎవరయినా తన్నుకుపోయే అవకాశం వుందని హెచ్చరించాడు శరభలింగం. అతనిది 'అర్థ'వంతమైన ఆదుర్దా.

ఫోనులో విషయం విన్నాక శివబ్రహ్మం ఆందోళన అపరిమితమైంది. మర్నాడుదయం బస్సులో వల్లాపురం చేరాడు.

వల్లాపురంలో ఎక్కువ రాజుల కుటుంబాలు. చాలాకాలం నుండి పూర్వపు ఆస్తులను కాపుడుకుంటూ వుంటున్నారు.

బస్సు దిగిన శివబ్రహ్మాన్ని చూస్తూనే నల్గురూ పోగయినారు. బాగా పరిచయస్తులైన చంద్రశేఖర రాజుగారు మాత్రం తెగవాపోయారు. 'విజయనగరం

వెళ్ళిపోయాక రావటమే మానేశారు' అన్నారు.

నిమ్మళంగా కూర్చొని కాఫీ తాగారు. అపుడు అసలు విషయం బయటపెట్టాడు శివబ్రహ్మం.

"ఇక్కడికంటె వట్నంలో చదువు-సంధ్యలు బాగా కుదిరాయి. నాకక్కాడాఅంతోయింతో ప్రైవేటుకంపెనీలో వసుంది. అందుకని ఈ ఇల్లు అమ్మివేద్దామనుకుంటున్నాను".

చంద్రశేఖర రాజుగారేకాక మిగతావాళ్ళుకాక వినకూడని మాట చెవినపడ్డట్లుగా జలదరించారు.

"అయ్యా! మీ కుటుంబాలు తరతరాలుగా ఈ వూరిని, ఈ వాతావారణాన్ని నమ్మాయి. అమ్మటం మంచిది కాదేమో ఓసారి బాగా ఆలోచించి ఓ నిర్ణయానికి రండి" రాజుగారు హితవు పలికారు.

"బాగా ఆలోచించాకే ఈ నిర్ణయానికి వచ్చాను. అంతేకాదు తోటను కూడా బేరం పెడదామనుకుంటున్నాను. ఎవరికయినా కావలిస్తే చూడండి" మరొకరి మాట యిమడగూడని విధంగా సంభాషించాడు.

ఈ ప్రస్తావన వూరివారందర్నీ కదిలించింది. ఒకప్పుడు శివబ్రహ్మం తాతగారుండే ఆ ఇల్లు గ్రామస్తులకు న్యాయపీఠంగా ఎలా అలరారేదో యిప్పటికీ జ్ఞాపకమున్న ముసలాళ్ళు ముక్కున వేలేసుకున్నారు.

ఇంటిని సెటిల్ చేయటానికి చంద్రశేఖరరాజుగారే సారథి. పదివేలంటూ పట్టుకు కూర్చుంటే బేరం సాగదని చెప్పారు. కొంచెం హెచ్చుగా వచ్చేట్లు చూడమన్నాడు. శివబ్రహ్మం.

ఎనిమిది వేలకి ఇల్లు బేరమైంది. రిజిస్ట్రేషన్ కొన్నవారే భరించటానికి ఒప్పందం. ఇంక తోటని ఎవరోకాదు... స్వయానా చంద్రశేఖరరాజుగారే కొనటానికి ముందుకు వచ్చారు. మొహమాటంవల్ల ఆయన్నే తోటకి రేటుకట్టి యివ్వమని చెప్పారు.

సబువుగానే అరవైవేలు చెప్పారు రాజుగారు. ఆ రేటుకే సెటిలైపోయింది. తనతోపాటు వారిని తీసుకెళ్ళి రిజిస్ట్రేషన్ వ్యవహారాలన్నీ దగ్గరుండి చేయించి మరీ పంపాడు శివబ్రహ్మం.

అందిన పైకాన్ని పట్టుకుని హుటాహుటిన వెళ్ళాడు. శరభలింగం అప్పటికే ఆత్రంగా వున్నవాడిలా కనిపిస్తున్నాడు. ఎదురుగా ఎవరో? "అరవైవేలయినా ఆ ప్లాట్

నాపరం కావలసిందే! కమీషన్ అందరికంటే మరో రెండు వందలు ఎక్కువ యిస్తాను" ప్రాధేయపడ్తున్నాడు.

శివబ్రహ్మాన్ని చూసి యిటు తిరిగాడు శరభలింగం. "నువ్వొక్క క్షణం లేటయితే ఇద్గో ఈయనకి సెటిలైపోవలసింది. ఇంతకీ కాయా పండా!" కళ్ళల్లో ఆందోళన మెరుపులు.

"పండే! కూర్చోవటానికి సిద్ధమైనాడు. కుర్చీలోని ఆసామీ శరభలింగం వంక, శివబ్రహ్మం వంక చూపులు మారుస్తూ అక్కసు ప్రదర్శించాడు.

"మిమ్మల్ని నమ్ముకుని శిగడాం నుండి వచ్చాను. ఇంత పక్షపాతం వహిస్తారనుకోలేదు" దిగ్గున లేచాడు. సూట్‌కేసు అందుకుని చకచక వెళ్ళాడు.

శివబ్రహ్మం చిత్తరువే అయినాడు.

"నువ్వలా సైలెంట్ మర్డర్ అయినవాడ్లా ఉలుకు పలుకు లేకుండా అయిపోకు. ఒక్కఫోన్ కొట్టి మన పార్టీని తెప్పిస్తా. ఇలాటివీ బిజినెస్‌లో మామూలే"

అసిస్టెంట్ చేత ఫోన్ చేయించాడు. "అవతల పార్టీకి సాయంత్రం నాల్గుదాకా వీలవట్ట" అసిస్టెంట్ చెప్పాడు.

అంతవరకూ ఏభైవేల రొక్కంతో యిక్కడ వుండిపోవటం యిష్టంలేక యింటికి వెళ్ళటానికి సర్దుకున్నాడు శివబ్రహ్మం.

"ఏమొచ్చింది అపుడే పోతావా! వెళ్దూగాని! నీప్లాటోసారి చూస్తానంటే చూడు. డౌటు తీరిపోద్ది. కళ్లారా చూస్కుంటే కడుపు నిండుద్ది" అసిస్టెంట్‌నిచ్చి కారులో వెళ్ళమన్నాడు.

ఫ్లాట్ చూడాలన్న దుగ్ధవున్నా బ్యాగ్ వదలాలని లేదు.

"ఏంటోయ్ అంత నమ్మకం లేదా! అంత క్యాష్ పట్టుకుని కార్లో వెళ్తే ఏడెకాయటీ వోడయినా మద్దెనాపి అంతా కొల్లగొట్టేయగల్డు. తరవాత నీ యిష్టం" ఆ బెదిరింపు శివబ్రహ్మం చంకలో పట్టు సడలించింది. శరభలింగం అసిస్టెంట్‌కి కనుసైగ చేశాడు. ఆ సంచి అందుకుని, గాడ్రెజ్ బీరువాలో పెట్టి తాళం వేశాడు.

కారెక్కాడే కాని భయం నీడలా వెంటాడుతోంది. అవతల ఏభైవేలు తొక్కేయడు కదా! కనీసం నల్గురి ఎదుట లెఖ్ఖబెట్టేనా యివ్వవలసింది. అయినా శరభలింగానికీ, తనకీ ఏమిటి సంబంధం? ఏదో బీరకాయ పీచు. అన్నదమ్ముల్లోనే స్పర్ధలొస్తున్న రోజులు.

అందులో మనిషికి నాగుపడగ నీడలాంటిది డబ్బు. ఉచ్చం, నీచం అనకుండా

మనసులోని మంచితనాన్ని కాటువేసి దోపిడీ వైఖరికి నీరుపోస్తుంది.

సన్నని చెమటలు ఉద్భుతమౌతున్నాయి. ప్రకృతి చల్లగా వుంది. అయినా గాబరా లెత్తిపోతూంది. శివబ్రహ్మం హైరానా అసిస్టెంట్‌కి అర్థంకావటంలేదు.

స్టీల్‌ప్లాంట్ ఏరియాకి దూరంగా కారాగింది.

ఉక్కు కర్మాగార స్థాపనకు ముమ్మరంగా సాగుతున్న పనులు. దిగిన తరువాత కొంతదూరం కొండమీదకి నడిపించాడు అసిస్టెంట్.

ఉత్తరంగా చూపిస్తూ – "అవే మీ ప్లాట్స్.. అందులో మీది చివరి వరుసలో కుడివైపుది. మూడొందల గజాలు"

ఉట్టికొండ... రాళ్లు రప్పలు... ముళ్ళపొదలు తప్ప యింకేం కనిపిస్తాయి. తను వృథాగా డబ్బు మట్టిపాలు చేయటంలేదుకదా!?

"సార్! మీరేదో అనుమానపడ్తున్నట్లు... అసంతృప్తిగా వున్నట్లు మీ మొహం చెబుతూంది. ఆలోచించుకోండి. ప్లాట్ వుంచేసే కంటె ఇల్లు కట్టేస్తే మంచిది. ఎవరికళ్ళయినా పడే ప్రమాదముంది" అసిస్టెంట్ సలహా.

"ఎలా వుంది?" తిరిగొచ్చిన గుండె దడదడ అడుగుల్లో చూపిస్తూ ముందుకొచ్చి నిలబడ్డ శివబ్రహ్మాన్ని శరభలింగం అడిగాడు.

"అంతా అయోమయంగా వుంది లింగం!!! రాంగ్ స్టెప్ వేయటం లేదు కదాన్న అనుమానం!" తొలుస్తున్న సందేహం.

"నీకంత బాధగా వుంటే చెప్పు.. ఇందాక పార్టీకి ఫోన్ కొట్టి పిలిపించుకుంటా" ఖాతరు లేనట్లు మాట్లాడ్డంలోనే ప్లాట్‌కి ఎంత విలువుందో స్పష్టమౌతుంది.

"ఆహా! అలా అని కాదు. సరే నీ యిష్టం" తెగించి అనేశాడు.

శివబ్రహ్మం నగదు అతని చేతుల్లో పెట్టాడు. నాలుగు గంటలకి పార్టీ హాజరయింది. రాతకోతలు, సంతకాలు పకడ్బందీగా జరిగాయి.

అపుడు గుండెలపై చేయి వేసుకునే క్షణం వచ్చింది. ఇంటికెళ్ళి భార్య, కొడుకుతో చెప్పాడు. వాళ్ళకిది కంటగింపుగానే వుంది. అదేదో సామెతలా అవతల నిక్షేపంలాంటి ఇంటిని, బంగారం లాంటి తోటని అమ్మిపారేసి యివతల కొండగుట్టలలో ప్లాట్‌పైన డబ్బు గుమ్మరించటమా! వెర్రిపని.

తనకు నచ్చినది వారికి నచ్చదని తెలిసిన శివబ్రహ్మం ఆ ప్రస్తావన పొడిగించటానికి ఇష్టపడలేదు. చేతిలో ఇంకా కొంత సొమ్ముంది. దానితో పునాదులు

వేయాల్సి వుంటుంది.

రెండు వారాలు గడిచాయి... శరభలింగం కబురుపెడితే శివబ్రహ్మం వెళ్ళాడు.

"అందరూ పునాదులు వేస్తున్నారు. నువ్వుకూడా పైసలు పట్టుకు దిగకూడదూ! ఓ యేడాది కన్నా ఇల్లు తయారవుద్ది" శరభలింగం ప్లాన్ చెప్పాడు.

అంతా బాగానే వుంది. ప్రస్తుతం చేతిలో వున్న పైసలు పట్టుకుని దిగితే మరి ఎక్కడా కాణీమిగల్దు.

అయినప్పటికీ ఒక స్థిర నిశ్చయానికి వచ్చినవాడిలా "సరే! మంచిది చూస్కుని ప్రారంభిద్దాం" శివబ్రహ్మం అన్నాడు.

"మంచేటి? ఔడేటి? నువు చేస్తున్నదే మంచి కోసం..." కర్మసిద్ధాంతాన్ని కొట్టిపారేసాడు.

కాంట్రాక్టర్‌ని అప్పగించాడు. పునాదులదాకా ఒప్పందం!

"మరీ కాంట్రాక్టర్‌పై వదిలిపెట్టడం మంచిదికాదు. మనమటుకు ఒక కన్నువేసి వుంచటం మంచిది" ముందస్తుగానే చెవిన వేసాడు శరభలింగం.

తన ప్రైవేటు కంపెనీ వాళ్ళు మాటిమాటికి సెలవులంటూ పెట్టనివ్వరు. అయినా అక్కడ కూర్చోవటం తనకు కుదరదు. కాబట్టి శిరీష్‌నే అక్కడికి పంపిస్తుండాలి.

తనకు పరీక్షలు దగ్గర పడ్డాయని వెళ్ళటానికి వీలవదని, తన యిబ్బందిని వివరించాడు. శిరీష్.

పెళ్ళాన్ని పొమ్మంటే బాగోదు కాబట్టి.... "పుస్తకం పట్టుకుని పోయి అక్కడే చదువుకో... "తండ్రి జారీచేసిన ఆర్డర్‌ను ధిక్కరించే ధైర్యం ఒంటబట్టక పోవటంవల్లే శిరీష్ ఒప్పుకొన్నాడు.

కొడుకు శిరీష్ పర్యవేక్షణలో పునాదులు పూర్తికావటం గుండెనిబ్బరం తెప్పించింది. ఒకసారి వెళ్లి చూసుకున్నాడు. చాలామంది ఇళ్లు కట్టే ప్రాథమిక దశలో వున్నారు. శరభలింగం మోసానికి తావివ్వని సలహాలు తనని ముందుకు నడిపిస్తున్నాయి.

"నీ తోటివాళ్ళు ఇల్లు కట్టడం ప్రారంభించారు. మర్నువ్వో! ఎలాగో బాధపడి మొదలెట్టేయ్" మరో సలహా!

మెదడు తొలవటం మొదలైంది.

చేతిలో కాణీ లేదు. ఉన్నదల్లా భార్య మెడలో నాల్గుతులాల చంద్రహారం. అది అమ్మనిస్తుందో లేదో భార్య... అనుకుంటూనే చెప్పాడు. అన్నట్లుగానే వితర్కించింది.

పుట్టింటివాళ్ళు ప్రేమతో పెట్టిన అపురూప చంద్రహారం రాళ్ళురప్పలపై పెట్టడానికి యిష్టపడనట్లు వ్యవహరించింది.

కొయ్యలాంటి శివబ్రహ్మం తాను పట్టిన పట్టువిడవడు. ఈ అద్దెయిళ్ళ అష్టకష్టాలు పడేకంటే ఇల్లు కట్టుకుంటే ఉత్తమం కాదాని చెప్పి ఒప్పించి మరల యింటిపై ధారపోసాడు.

పరీక్షలైనాయి శిరీష్‌కు. వెళ్ళి చూసివస్తున్నాడు. యూనిట్ల ప్రకారం కట్టు పని సాగుతోంది.

శరభలింగం అంచనాల మేర అన్నీ సాగుతున్నాయి. ప్రత్యేకించి తమ యింటి విషయంలో శ్రద్ధ వహిస్తున్న శరభలింగం అదో రకమైన తరహా చిత్రమనిపించింది శిరీష్‌కు.

ఇరవైరోజులకు స్లాబ్‌దాకా వచ్చి ఆగింది. శివబ్రహ్మం తలతిరిగిపోయింది. శ్లాబ్ పూర్తవుతుందని కనీసపుటంచనా వేసాడు. ఖజానా ఖాళీ అయినా అభివృద్ధి పనులు కనిపించనట్లుగా అయింది పరిస్థితి.

శరభలింగం దగ్గర మొరపెట్టుకున్నాడు.

"ఊబిలో దిగిపోయాను... ఇంక నావల్ల కాదు. చేతులెత్తేసాను. నాకు చేతనయినపుడు కట్టుకుంటా!" రెంజు చేతుల్లో మొహం దాచుకున్నాడు.

మొహానికి అడ్డుగా వున్న చేతులను నెమ్మదిగా తొలగించాడు. గడ్డం పట్టుకుని ఇటు తిప్పి... "మరొక యాభైవేలు పట్టుకుంటే ఫినిషైపోతుంది" భయం పోగొట్టే ప్రయత్నంగానే అన్నాడు శరభలింగం.

కాని, అది మరింత భయపెట్టేట్లు చేసింది శివబ్రహ్మాన్ని.

"ఏభైవేలా! ఇప్పటికే నా పని ఫినిషైపోయింది" అతని గుండెల్లోని బెంగ మొహంమీద ఒక కవళికగా మారింది.

"ఇంతదాకా నా సలహాలు పాటిస్తూ వచ్చావ్! మంచిది ఏదయినా అమ్మేయవయ్యా! అమ్మేస్తే ఓ యింటివాడివవుతావు" నవ్వాడు శరభలింగం.

"నీకు నవ్వొస్తుందేమో కాని... నాకు ఏడుపొస్తూంది. ఏం మిగిలిందని అమ్మేయటానికి... బోడి..." రుసరుసలాడాడు.

"మిగిలుంటే అమ్మేస్తావా! నీ సమస్య తీరిపోతుంది..."

"వేళాకోళానికిది సమయం కాదు లింగం!! నా దగ్గరేముందని!!"

"నీ దగ్గర చాలా విలువైనదే వున్నది. అది నీ మనసింకా గుర్తించలేదు. చెబుతా అదీ పాటిస్తానంటే!"

"చెప్పు" విచికిత్సగా చూసాడు శివబ్రహ్మాం. చెప్పాడు శరభలింగం.

శివబ్రహ్మాం మది.. మజ్జిగ చిలికినప్పటి నురగల్లో తేలియాడిన వెన్నయింది.

★ ★ ★

మరొక నెలరోజులు గతించాయి.

బాలారిష్టాలన్నీ దాటుకుని వచ్చిన వ్యక్తిలా ఒక రూపం సంతరించుకుని హుందాగా నిలబడిందా యిల్లు.

ఆ ఇంటి గృహప్రవేశం వైభవంగా జరిగింది.

స్వగృహ నిర్మాణ కోసం ఎంతగానో కలలు కన్న శివబ్రహ్మాం చివరిగా అమ్మిన వస్తువు...శిరీష్.

ప్రస్తుతం అతను శరభలింగం ఇల్లరికపుటల్లుడు.

తను ఇంటివాడు కావటానికి... కొడుకుని ఇం(త)టి వాడ్ని చేయక తప్పింది కాదు మరి!!

(ఈనాడు ఆదివారం 28-10-1990)